క్లుప్తంగా

వేంకటాద్రిపై పవిత్రోత్సవాలు

- వెంకన్నకు అభిషేకాలు, విశేష పూజలు



పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పవిత్రోత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వెంకన్నకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం పూజలు జరిపారు. ముందుగా విష్వక్సేన పూజ, రక్షా బంధనం, రుత్విగ్వరణం, అగ్ని ప్రతిష్ట, శాత్తుమురై నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

'సీఐటీయూ నేత రమేష్ స్ఫూర్తి కొనసాగిద్దాం'



రమేష్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: కార్మిక సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన సీఐటీయూ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ మరణించి ఏడేళ్లయిందంటే నమ్మలేకపోతున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. రమేష్ 7వ వర్ధంతిని స్థానిక సినిమాహాలు కూడలిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రజల సమస్యలపై రమేష్ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలు, బోనస్, ఉద్యోగ భద్రత కోసం అనేక పోరాటాలు చేశారని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు నాయుడు, శ్రీను, గుర్నాథరావు, అప్పారావు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్లో సైకిల్ షెడ్

పరవాడ: ఎన్టీపీసీ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరవాడ జెడ్పీ హైస్కూల్లో సీఎస్సార్ నిధులతో నిర్మించిన సైకిల్ షెడ్‌ను సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ షెడ్‌ను ఏర్పాటు చేశామని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైకిల్ షెడ్, స్థానిక భవిత కేంద్రం చుట్టూ రక్షణ గోడ నిర్మాణం పనులు కూడా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, సింహాద్రి ఎన్టీపీసీ, సీఎస్సార్ అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తనిఖీలు



సబ్బవరంలోని మెకానిక్ షాపులో అధికారులు

సబ్బవరం: పాన్ ఇండియా బాల కార్మిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ, ఐసీడీఎస్, సీడ్స్ అర్గనైజేషన్, పోలీస్ డిపార్ట్‌మెంట్లు సంయుక్తంగా మండల కేంద్రం సబ్బవరంలో గురువారం పలు దుకాణాలు, మెకానిక్ షాపులు, దాబాలు, హోటళ్లను తనిఖీ చేశారు. తక్కువ జీతాలు చెల్లిస్తున్న యజమానులపై సంబంధిత అధికారుల వద్ద తేడా జీతం వ్యత్యాలసాలపై క్లెయిమ్‌లు దాఖలు చేయనున్నట్లు కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ తెలిపారు. 18 ఏళ్ల నిండలి బాలలను పనిలో పెట్టరాదన్నారు. చట్టాన్ని ఉల్లింఘిస్తే రూ.20 వేలు జరిమానా విధిస్తామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నారని తెలిస్తే 99480 37377, 94925 55018 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చన్నారు. ఈ తనిఖీల్లో సబ్బవరం ఎస్‌ఐ దివ్య, ఐసీడీఎస్ సీడీపీవో లలిత కమారి, సూపర్‌వైజర్లు పైడితల్లి, వై.ఇందిర, కె.స్వర్ణలత, సీడ్స్ తరపున చిన్నారావు, జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఇంజినీర్ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

జల్ జీవన్ మిషన్‌కు గ్రహణం



అంతకాపల్లిలో పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్(జేజేఎం) పథకానికి ప్రాధాన్యతనిచ్చింది. సబ్బవరం మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయిని ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన తాగునీరందించేందుకు రూ.13.99 కోట్లు కేటాయించింది. సగం నిధులు వెచ్చించి, కొన్ని గ్రామాలకు తాగునీరందించింది కూడా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ పనులతోపాటు, టెండర్ దశలో ఉన్న పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారాయి.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చురుగ్గా సాగిన పనులు
- కూటమి ప్రభుత్వంలో ఎక్కడికక్కడ నిలిచిన పనులు
- ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు ఎప్పుడో?
- గ్రామాల్లో ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు
- కొత్తగా టెండర్లకు సన్నాహాలు



వంగలిలో పైప్‌లైన్ల కోసం గతంలో రప్పించిన పైప్‌లు(ఫైల్)

గ్రామ పంచాయతీలు 24	మొత్తం గ్రామాలు 70	మొత్తం గృహాలు 18,860	కుళాయిలున్న ఇళ్లు 7,649

సబ్బవరం: మండలంలో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసే దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. జల్ జీవన్ మిషన్(జేజేఎం) పథకం ద్వారా రూ.13.99 కోట్లతో ఇంటింటికీ తాగునీటి వసతి కల్పించేందుకు పనులు చేపట్టింది. దీంతో 24 పంచాయతీల పరిధి 70 గ్రామాల్లో ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు 87 వర్క్‌లను పట్టలెక్కించింది. ఇందులో 26 పనులు పూర్తయిన, తుది దశకు చేరిన కేటగిరీలోఉన్నాయి. మిగిలినవి పెండింగ్, టెండర్ దశ దాటనివి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

కూటమి రాకతో పనులకు బ్రేక్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చురుగ్గా సాగిన జేజేఎం పనులకు కూటమి ప్రభుత్వంలో బ్రేక్ పడింది. గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరైనా ఆ పనుల్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రస్తుతం ప్రభుత్వం చొరవ చూపని దుస్థితి. రూ.13.99 కోట్ల నిధులతో ప్రతిపాదించిన 87 పనుల్లో రూ.7.72 కోట్ల విలువైన 26 పనులకు మాత్రమే మోక్షం కలిగింది. రూ.6.27 కోట్ల విలువైన 61 పనులు టెండర్ దశలోనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఆ పనులకు మళ్లీ అంచనాలు రూపొందించాల్సి ఉందని మెలిక పెట్టింది. ఈ అంచనాలు రూపొందించి, ఆ మేరకు నిధులను రప్పించుకుని, పనులు మొదలపెట్టేందుకు మరెంత సమయం తీసుకుంటారో వారికే తెలియాలి.

జల్ జీవన్ మిషన్ కేటాయింపులు

మంజూరైన పనులు	87
కేటాయించిన నిధులు	రూ.13.99 కోట్లు
పూర్తయిన, వివిధ దశల్లో ఉన్న పనులు	26
వీటికి వెచ్చించిన నిధులు	రూ.7.72 కోట్లు
టెండర్ దశ దాటని పనులు	61
మిగులు పనుల నిధులు	రూ.6.27 కోట్లు

తాగునీటి సౌకర్యం దక్కినవి

గ్రామం	నిధులు (రూ.లక్షల్లో)
రాపర్తివానిపాలెం	13.46
ఒమ్మివానిపాలెం	11.30
బొండవానిపాలెం	14.75
సాలాపువానిపాలెం	14.06
అమృతపురం	30.25
అసకపల్లి	28.30
ఎరుకునాయుడుపాలెం	16.93
పెదనాయుడుపాలెం	27.90

పూర్తయిన పనులు

గ్రామం	నిధులు (రూ.లక్షల్లో)
అంతకాపల్లి	29.28
సబ్బవరం	137.00
వంగలి	33.61
రావలమ్మపాలెం	43.39
ఆరిపాక	26.83
గొల్లలపాలెం	27.05



గుల్లేపల్లిలో నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

వివిధ దశల్లో ఉన్న పనులు

గ్రామం	నిధులు (రూ.లక్షల్లో)
మొగలిపురం	69.15
సూరెడ్డిపాలెం	27.55
ఎల్లుప్పి	16.84
గాలిభీమవరం	18.41
గొటివాడ	28.04
గుల్లేపల్లి	44.65
మల్లునాయుడుపాలెంలో	28.19
పైడివాడ	15.35
తవ్వవానిపాలెం	29.50

వీధి కుళాయిలే దిక్కు



గ్రామంలో కొన్నిళ్లకే తాగునీటి కుళాయిలు బిగించారు. మిగిలిన వారికి ఎప్పుడు బిగిస్తారో తెలియదు. ప్రభుత్వం మారిపోయాక ఈ పనులు కూడా ఆగిపోయాయి. కుళాయిల్లేని వారంతా వీధి కుళాయిల వద్దే నీటిని పట్టుకోవాల్సి వస్తోంది. ప్రతి ఇంటికీ తాగు నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తే మా గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోయేది. ఎప్పుడు పనులు ప్రారంభిస్తారో తెలియట్లేదు.

– వడిశల వెంకటలక్ష్మి, తెలుకులపాలెం

ట్యాంక్ కెపాసిటీ చాలట్లేదు



మా గ్రామంలో సుమారు 90 వరకూ ఇళ్లున్నాయి. ఇంటింటికీ తాగు నీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఉన్న వాటర్ ట్యాంక్ కెపాసిటీ సరిపోవడంలేదు. దీంతో చాలినంత నీరు కుళాయిల ద్వారా అందట్లేదు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం ఉన్న ట్యాంకుకు బదులు పెద్దట్యాంకు ఏర్పాటు చేయాలని అధికారుల్ని కోరినా, సమస్య పరిష్కారం కావట్లేదు.

– దార భారతి, ఎ.సిరసపల్లి

మిగులు పనులకు రీ ఎస్టిమేషన్



జేజేఎంలో భాగంగా మండలంలో రూ.7.72 కోట్లతో ఇంటింటికీ కుళాయిల పనులు మొదలెట్టాం. ఈ నిధులతో 26 వర్క్‌లు చేపట్టాం. కొన్ని వర్క్‌లు పూర్తయి, ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరందిస్తున్నాం. మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. టెండర్లు పిలవని పనులు నిలిచిపోయాయి. ఈ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రీ ఎస్టిమేషన్లు వేసి ఆ మేరకు నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలవనుంది.

– డి.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సబ్బవరం

సింహాచలం నుంచి పంచారామాలకు బస్సులు

సింహాచలం: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈ నెల్లో వచ్చే ఆదివారా(10, 17, 24 తేదీ)ల్లో సింహాచలం ఆర్టీసీ డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ గురువారం మీడియాకు తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బస్సులు బయలుదేరి మరుసటి రోజు సోమవారం రాత్రి తిరిగి చేరుకుంటాయన్నారు. అమరేశ్వరస్వామి(అమరావతి), సోమేశ్వరస్వామి(భీమవరం), క్షీరా రామలింగేశ్వరస్వామి(పాలకొల్లు), భీమేశ్వరస్వామి(ద్రాక్షారామం), కుమార రామలింగేశ్వరస్వామి(సామర్లకోట) క్షేత్రాలను దర్శించుకునేలా ఈ బస్సుల్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అల్ట్రా డీలక్స్‌లో ఒకరికి రూ.2,100, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో రూ.1,650 టికెట్‌గా నిర్ణయించామన్నారు. సింహాచలం ఆర్టీసీ డిపోలో టిక్కెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. గ్రూప్‌గా బుక్ చేసుకున్న వారి సౌకర్యార్థం ఇంటి వద్దకే బస్సుని పంపించే ఏర్పాటు చేస్తామన్నారు. గ్రూప్ బుకింగ్‌లు చేసుకుంటే అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, అరకు, బొర్రాగుహలు, పాడేరు, లంబసింగిలకు బస్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు డిపో అసిస్టెంట్ మేనేజర్(799720493), ట్రాఫిక్ సూపర్‌వైజర్(7382917295)లను సంప్రదించాల్సిందిగా కోరారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం



పరవాడలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించిన దృశ్యం

పరవాడ: క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హారిక సూచించారు. క్యాన్సర్ వ్యాధిపై పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం పరవాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ హారిక మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే, చికిత్స ద్వారా ఆరోగ్యవంతులు కావచ్చన్నారు. చర్మం, మలమూత్ర విసర్జనలో మార్పులు, పొత్తికడుపులో నొప్పి, మానని పుండ్లు, రుతు క్రమంలో మార్పులు, అధిక రక్తస్రావం, రొమ్ముల్లో గడ్డలు, జీర్ణ సంబంధమైన సమస్యలు, గుటక వేయడంలో ఇబ్బందులు, పుట్టుమచ్చల్లో మార్పులు, నిరంతరం దగ్గు, గొంతు బొంగురు పోవడం, అకస్మాత్తుగా బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ప్రాథమిక దశలోనే చికిత్స పొందాలన్నారు. ర్యాలీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.ఎస్.సాయిరాం, స్టాఫ్ నర్స్ భవాని, ఫార్మసిస్ట్ విజయకుమారి, ఎల్.టి.అన్నపూర్ణేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. ఈ నెల 2 నుంచి 6 వరకు మనవాళ మహాముునుల తిరునక్షత్రం సందర్భంగా ఆర్జిత సేవలన్నీ రద్దు చేసిన విషయం తెలిసిందే. గురువారం నుంచి వీటిని పునరుద్ధరించారు. దీనిలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆందోళన చేస్తున్న వీవోఏలు



ఎంపీడీవో పద్మజకు వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం విలేజ్ ఆర్గనైజర్ అసిస్టెంట్(వీవోఏ)ల మెడపై కత్తి పెట్టిందని ఆ సంఘం మండల అధ్యక్షురాలు శ్రీలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే వీవోఏల ఉద్యోగ భద్రతపై సానుకూల ప్రకటన చేయడంతో పాటు దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక వెలుగు కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ వీవోఏల 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. సీబీవో, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేసి స్థిరమైన ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతీ వీవోఏకి కనీసం రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, గ్రామాల్లో 15 డ్వాక్రా సంఘాలు ఉన్న వీవోఏలకు దీర్ఘకాలంగా వేతనాలు చెల్లించలేదని, వాటిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. లోకో యాప్ వాడకం కోసం ప్రభుత్వమే 5జీ మొబైల్ సమకూర్చాలని, వలంటీర్ల ఐడీలతో కాకుండా వీవోఏలకు సొంత ఐడీని ఇవ్వాలన్నారు. వీవోఏల సర్దుబాటు వలన ఉపాధి కోల్పోయిన వారికి తగిన నష్టపరిహారం అందించాలన్నారు. వయసు, విద్య, ఇతర ప్రమాణాలతో ఇప్పటికే పనిచేస్తున్న వీవోఏలను తొలగించకుండా తగిన ఆదేశాలివ్వాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎ.శారద, జి.రమణి, ఎ.లక్ష్మి, రాజ్యలక్ష్మి, సీఐటీయూ నాయకులు కె.అప్పలనాయుడు, ఎస్.ప్రభ, దేవా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట..

సబ్బవరం: బకాయి వేతనాలను చెల్లించి, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని మండలంలోని వెలుగు వీవోఏలు డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మూడు రోజులుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో పద్మజకు వినతిపత్రం అందించారు. వినతి పత్రంలో వీవోఏలకు 5 నెలలుగా బకాయిపడిన వేతనాలను వెంటనే చెల్లించాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులను ఆపాలని, లాంగ్ పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళా మార్టులలో సరకుల కొనుగోలుపై బలవంతపు టార్గెట్ల పద్ధతిని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు వీవోఏలు కె.లక్ష్మీప్రసన్న, వి.కనకమహాలక్ష్మి, పి.వరలక్ష్మి, సీత, లక్ష్మి, మంగ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- జాతీయ రహదారిపై చిన్నయ్యపాలెం వద్ద ఘటన
- గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి



మృతదేహం (ఇన్‌సెట్) మృతుడు సింహాద్రి(ఫైల్)

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై చిన్నయ్యపాలెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీస్‌లు తెలిపిన వివరాలు. కోటవురట్ల మండలం రాట్నవానిపాలేనికి చెందిన మానేపల్లి సింహాద్రి(21) సబ్బవరం మీదుగా ద్విచక్ర వాహనంపై కొత్తవలస వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సింహాద్రికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఇంటర్ పూర్తి చేసి, ఇంటి వద్దే ఉంటున్నాడు. తండ్రి కొండలరావు, తల్లి లక్ష్మి, పెళ్లైన అక్క ఉన్నారు. అక్క శ్రీకాకుళపు సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.దివ్య వెల్లడించారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెందుర్తి: రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తెలిపారు. ఈ మేరకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో గురువారం సమావేశమయ్యారు. వారోత్సవాల్లో భాగంగా పతాకావిష్కరణ, పుస్తక ప్రదర్శన, స్కూల్ విద్యార్థులకు వివిధ పోటీలు, కవి సమ్మేళనం, గ్రంథాలయ ఉద్యమకారుల జీవిత విశేషాలపై చర్చ నిర్వహించేందుకు తీర్మానించారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రెసిడెంట్ పెతకంశెట్టి భూలోకరావు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, కోశాధికారి పెంటకోట గణేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాంకీ ఫౌండేషన్ నేత్ర వైద్య శిబిరానికి స్పందన



వైద్య సిబ్బందికి జ్ఞాపిక అందిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: కంటి సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాంకీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కళ్లకు వచ్చే సమస్యలను సకాలంలో సరిచేసుకోకపోవడం వల్ల అంధత్వానికి లోనవుతున్నారన్నారు. సమస్యను గుర్తించి, వెంటనే చికిత్స చేయించుకుంటే కంటి చూపును కాపాడుకోవచ్చన్నారు. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న రాంకీ ఫౌండేషన్ యాజమాన్యాన్ని అభినందించారు. అర్హులైన వారికి ఉచితంగా కళ్లద్దాలను అందించనున్నట్లు రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ తెలిపారు. ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌బక్షి మాట్లాడుతూ రాంకీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పరిసర గ్రామాల ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 153 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఫార్మాసిటీ హెచ్‌ఆర్ భరత్, ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, మహిళా కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'జీవన శైలి, ఆహార అలవాట్ల మార్పుతో క్యాన్సర్'



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న రామ్మోహనరావు

సబ్బవరం: మారిన ప్రజల జీవన శైలి, ఆహారపు అలవాట్లే క్యాన్సర్‌కు కారణమవుతున్నాయని ఏఎంఎల్ కళాశాల విశ్రాంత రసాయన శాస్త్ర అధ్యాపకుడు కె.రామ్మోహనరావు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో క్యాన్సర్‌పై గురువారం అవగాహన కల్పించారు. క్యాన్సర్ కారకాలను, నివారణ అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య నియమాలు, అవగాహనతో క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, అధ్యాపకులు గోపాలకృష్ణ, డాక్టర్ నివేదిత, డాక్టర్ రత్నప్రకాష్, ఎంవీ రామకృష్ణ, బి.లక్ష్మి, కళాశాల జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

- పాఠశాల పరిసరాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో బాలాజీ



వైద్య శిబిరంలో డీఎంహెచ్‌వో బాలాజీ

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎంపీసీవీకే బాలాజీ పరిశీలించారు. గురుకులంలో చదువుతున్న ఓ విద్యార్థి అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చేరడంతో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు వైద్య సిబ్బందిని పంపించి, విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. దీన్ని పరిశీలించేందుకు వచ్చిన ఆయన గురుకుల పాఠశాల అంతా తిరిగి, పరిసరాలను పరిశీలించారు. శానిటేషన్, వాటర్ క్లోరినేషన్, ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ రామకృష్ణతో మాట్లాడి పలు సూచలను చేశారు. అక్కడి నీటి నమూనాలను సేకరించి, వాటిని రీజినల్ వాటర్ టెస్టింగ్ సెంటర్‌కు పంపించారు. అనంతరం ఆయన సబ్బవరం పీహెచ్‌సీని సందర్శించారు.